సాక్షి
రంగారెడ్డి
బుధవారం । 14 । మే । 2025



దప్పిక తీరుస్తున్న దాతృత్వం

ఏటా వేసవిలో చలివేంద్రాలు, అంబలి కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దప్పిక తీరుస్తున్నారు పలువురు. 8లో▸



ముందే తెలిసేట్టు..

పిడుగు పాటుపై పరిశోధనలు చేసిన భారత వాతావరణ శాఖ ముందే పసిగట్టేందుకు 'దామిని' యాప్‌ను రూపొందించింది. 8లో▸



చెరువెండుతోంది!

యాచారం మండల పరిధిలోని మెజార్టీ చెరువులు, కుంటలు ఎండిపోయి ఎడారిని తలపిస్తున్నాయి. 8లో▸

న్యూస్‌రీల్

కొత్త పుస్తకాలొచ్చాయ్



ఇబ్రహీంపట్నం రూరల్: బడిబాట కార్యక్రమంలో భాగంగా రాబోయే నూతన విద్యా సంవత్సరానికి కొత్త పుస్తకాలు వచ్చాయి. ఇప్పటికే విద్యా వనరుల కేంద్రానికి ప్రభుత్వం పుస్తకాలను చేరవేసింది. ఇబ్రహీంపట్నం మండలంలోని 49 ప్రభుత్వ పాఠశాలల్లో 5,600 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి 41,867 పుస్తకాలు కావాల్సి ఉంది. ఇప్పటికి 21,900 విద్యా వనరుల కార్యాలయంలో నిల్వ ఉన్నాయి. ప్రస్తుతానికి 50 శాతం మాత్రమే పుస్తకాలు వచ్చాయని మరో 50 శాతం బడులు తెరుచుకునేలోపు వస్తాయని అధికారులు తెలిపారు. తరగతుల వారీగా ఆయా పాఠశాలలకు చేరవేస్తామని చెప్పారు.

మాల్‌ను సందర్శించిన డిప్యూటీ కమిషనర్లు



పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

యాచారం: రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ కమిషనర్లు వెస్లీ, రవీందర్ మంగళవారం ఆత్మనిర్భర్ నేషనల్ పంచాయతీ అవార్డు దక్కించుకున్న మాల్ గ్రామాన్ని సందర్శించారు. అవార్డు రావడానికి కలిసొచ్చిన ఆర్థిక అంశాలపై అధ్యయనం చేశారు. ఐదేళ్లుగా పశువుల సంత ద్వారా గ్రామ పంచాయతీకి వస్తున్న ఆదాయం, గ్రామం అభివృద్ధి చెందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించారు. గ్రామంలోని పలు కాలనీల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్, ఇబ్రహీంపట్నం డివిజన్ పంచాయతీ అధికారి సాధన, ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలజ, మండల పంచాయతీ అధికారి శ్రీలత, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజు ఉన్నారు.

రైతులు అధిక దిగుబడితో ఆదర్శంగా నిలవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

యాచారం: కూరగాయలు, ఆకుకూరల దిగుబడి సాధించి ఆదర్శంగా నిలవాలని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు అన్నారు. రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన మండల పరిధిలోని చౌదర్‌పల్లిలో మంగళవారం రైతు సంక్షేమ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పైలెట్ పథకాన్ని సద్వినియోగం చేసుకుని రైతులు రాయితీపై అందజేసే వ్యవసాయ యంత్ర పరికరాలు, డ్రిప్, స్ప్రింక్లర్లు, ఇతర వ్యవసాయ పనిముట్లను పొందాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు నమోదు ప్రక్రియను తెలియజేశారు. జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి సురేష్‌కుమార్ వ్యవసాయ, పండ్లతోటల పెంపకం గురించి వివరించారు. డ్రిప్ పద్ధతి ద్వారా తక్కువ నీటితో అధిక దిగుబడి పొందొచ్చని తెలిపారు. సమావేశంలో ఇబ్రహీంపట్నం డివిజన్ ఏడీఏ సుజాత, మండల వ్యవసాయాధికారి రవినాథ్, ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి నవీన తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతగిరి: హైదరాబాద్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా టెక్నికల్ సంస్థ ఆధ్వర్యంలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను తల్లిదండ్రులు కోల్పోయిన బాలికల నుంచి, అక్రమ రవాణాకు గురైన, దివ్యాంగ బాలికల నుంచి మూడేళ్ల టెక్నికల్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మహిళా సంక్షేమ శాఖ అధికారి జయసుధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ తదితర కోర్సుల్లో సీట్లు ఉన్నాయని తెలిపారు. అమ్మాయిలు పాలిటెక్నిక్ అర్హత ప్రవేశ పరీక్ష రాయకున్నా కనీసం పదో తరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలన్నారు. ఈ నెల 20వ తేదీలోపు వికారాబాద్‌లోని బాల రక్ష భవన్‌లో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 96408 63896, 98496 72296 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఫ్యూచర్ ఫండ్



తాడిపర్తి పంచాయతీ కార్యాలయం

ఏడు గ్రామాలకు ప్రత్యేక నిధులు

- రూ.19.80 కోట్లు మంజూరు చేసిన టీజీఐఐసీ
- సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, ఇతర అభివృద్ధి పనుల కోసం ఖర్చు
- ప్రతిపాదనలు సిద్ధం చేసిన ఆయా శాఖల అధికారులు

యాచారం: ఫార్మాసిటీకి భూములిచ్చిన గ్రామాల్లో 'ఫ్యూచర్' మురిసేలా అభివృద్ధి పనులు చేపట్టడానికి అధికార యంత్రాంగం సిద్ధమైంది. ఇందులో భాగంగా టీజీఐఐసీ (తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ) ప్రత్యేక నిధులు మంజూరు చేసింది. బీఆర్‌ఎస్ హయాంలో మండలంలోని నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లోని పది వేల ఎకరాల అసైన్డ్, పట్టా భూములను ఫార్మాసిటీకి సేకరించడానికి నిర్ణయించి 7,641 ఎకరాలు సేకరించింది. రైతులు జీవనోపాధి పొందే రూ.కోట్లలో విలువచేసే వ్యవసాయ భూములను ఫార్మాసిటీకి ఇచ్చిన గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టడానికి టీజీఐఐసీ నిర్ణయించింది. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో ఫార్మాసిటీకి సేకరించిన భూముల సర్వే, ఫెన్సింగ్ పనులతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో వారి ఆందోళనలను దూరం చేసేలా, ఏళ్లుగా పలు సమస్యలతో సతమతవుతున్న ఆయా గ్రామాల ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించి ఫ్యూచర్‌సిటీపై సదాభిప్రాయం కలిగేలా సర్కార్ దృష్టి సారించింది.

ప్రాధాన్యత ప్రకారం

ఫార్మాసిటీకి భూములిచ్చిన గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, వీధి లైట్లు, తాగునీటి సరఫరాకు ప్రత్యేక లైన్లు, పలు రకాల 203 అభివృద్ధి పనులకు గాను టీజీఐఐసీ రూ.19.80 కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేసింది. ఫార్మాసిటీకి భూములిచ్చిన నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలతో పాటు అదనంగా తక్కళ్లపల్లి, తక్కళ్లపల్లి తండా, కొత్తపల్లి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఫార్మాసిటీకి భూములిచ్చిన గ్రామాల్లోనే ప్రస్తుత రేవంత్‌రెడ్డి సర్కార్ ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్న దృష్ట్యా ఆయా గ్రామాల్లో అన్ని రకాల అభివృద్ధి పనులు చేపట్టడానికి అధికార యంత్రాంగం ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో ఆయన నివాసంలో పంచాయతీ రాజ్, టీజీఐఐసీ అధికారులు సమావేశమై చర్చించారు. ఆయా గ్రామాల్లో ప్రాధాన్యత ప్రకారం అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే వారికి సూచించారు.

డ్రైనేజీ సమస్యకు పరిష్కారం



మా గ్రామాన్ని ఏళ్లుగా డ్రైనేజీ సమస్య వెంటాడుతోంది. గ్రామానికి మంజూరయ్యే నిధులతో డ్రైనేజీ కాల్వను నిర్మించుకుంటాం. శాశ్వతంగా డ్రైనేజీ సమస్యకు పరిష్కారం దొరకనుంది.

– వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్, నానక్‌నగర్

అభివృద్ధి చేసుకుంటాం



ప్రత్యేక నిధుల మంజూరు కింద మా తండాను చేర్చడం అభినందనీయం. వచ్చే నిధులతో తండాను అన్ని విధాలా అభివృద్ధి చేసుకుంటాం. సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు నిర్మిస్తాం.

– వెంకటేశ్ నాయక్, తక్కళ్లపల్లి తండా

అన్ని గ్రామాలకు నిధులు వచ్చేలా..



అన్ని గ్రామాలను ఆదర్శవంతంగా అభివృద్ధి చేయడమే లక్ష్యం. యాచారం మండలంలోని 24 పంచాయతీలకు ప్రత్యేక నిధులు వచ్చేలా చూస్తా. మొదటి విడతగా ఏడు గ్రామాలకు మంజూరయ్యాయి. మిగతా గ్రామాలకు సైతం నిధులు వచ్చేలా కృషి చేస్తా.

– మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం

మైసిగండిలో మహాద్భుతం

అమ్మవారిపై సూర్యభగవానుడి కిరణాలు



అమ్మవారి నుదుటిపై సూర్యకిరణాలు

కడ్తాల్: దక్షిణ తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన మైసిగండి మైసమ్మ ఆలయంలో మంగళవారం అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. ఆపద మొక్కులు తీర్చే దేవతగా, భక్తులు ఇలవేల్పుగా, నిత్యం దేదీప్యమానంగా వెలుగొందుతున్న మైసమ్మ తల్లి విగ్రహాన్ని సూర్యకిరణాలు తాకిన అపురూప ఘట్టం భక్తులను మైమరిపించింది. ఉదయం 11.58 నుంచి మధ్యాహ్నం 12.06 గంటల వరకు సూర్యభగవానుడి కిరణాలు అమ్మవారి విగ్రహంపై మెరుపులా ప్రసరించాయి. ఆలయ విమాన గోపురం మీదుగా గర్భగుడిలోని మైసమ్మ తల్లి నుదుటిపై పడిన కిరణాలు ప్రత్యేక వెలుగులు ప్రసరింపజేశాయి. గతేడాది మే14న సైతం ఇలాంటి దృశ్యమే ఆవిష్కృతమైందని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యమ నాయకులు

తెలంగాణ ఉద్యమనాయకులు

మొయినాబాద్: తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమనాయకులు దేశమొళ్ల ఆంజనేయులు, జి.వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. మున్సిపల్ పరిధిలోని అజీజ్‌నగర్‌లో మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మర్చిపోయిందని విమర్శించారు. ఉద్యమకారుల త్యాగాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. ఉద్యమకారులు సర్వం కోల్పోయి కష్టనష్టాలకోర్చి జీవనం సాగిస్తున్నారని.. అలాంటి వారిని ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించాలని, సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ఉద్యమకారులు మహిపాల్, సునీల్‌కుమార్, నవీన్‌కుమార్, చంద్రయ్య, మహేందర్, నర్సింలు, భిక్షపతి తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంతయ్య

కూలీల సమస్యలు పరిష్కరించండి

బీకేఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు కాంతయ్య

చేవెళ్ల: ఉపాధి హామీ పథకంలో పనిచేసే పేద కూలీలకు వెంటనే బిల్లులు విడుదల చేయాలని, పనిచేసే చోట మౌలిక వసతులు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బీకేఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు కె.కాంతయ్య అన్నారు. మున్సిపల్ కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవిలో ఉపాధి పనులు చేసే కూలీలకు పని చేసే చోట కనీస వసతులు కల్పించాలన్న నిబంధనలు ఉన్నాయని, వాటిని తప్పనిసరి పాటించాలన్నారు. కనీస వేతనం రావడం లేదని, ఐదు వారాల నుంచి ఉపాధి కూలీ డబ్బులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకానికి నిధులు కేటాయించాలని, కొలతలతో సంబంధం లేకుండా రోజు కూలీ రూ.700 ఇవ్వాలని, 200 రోజులు పనులు కల్పించాలని, కూలీలందరికీ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ.. కూలీలు, కార్మికులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోమని, అండగా నిలబడి పోరాడతామని పేర్కొన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు రామస్వామి, సత్యనారాయణ, ప్రభులింగం, అంజయ్య, జంగయ్య, మంజుల, మక్బుల్, నాలుగు మండలాల నాయకులు పాల్గొన్నారు.



❖ గ్రాండ్ వెల్‌కమ్

- పాతబస్తీలో ప్రపంచ సుందరీమణుల సందడి
- చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్
- లాడ్‌బజార్‌లో షాపింగ్
- చౌమహల్లా ప్యాలెస్‌లో డిన్నర్

చార్మినార్: మిస్ వరల్డ్–2025 పోటీల్లో పాల్గొంటున్న వివిధ దేశాలకు చెందిన కంటెస్టెంట్లు మంగళవారం పాతబస్తీలో సందడి చేశారు. వీరికి స్థానికులు గ్రాండ్‌గా వెల్‌కం చెప్పారు. సరిగ్గా సాయంత్రం 5.10 గంటలకు తెలంగాణ టూరిజం ఏసీ బస్సుల్లో ప్రపంచ సుందరీమణులు మదీనా మీదుగా చార్మినార్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన రోడ వెంట ప్రజలు నిలబడి ఘన స్వాగతం పలకగా.. బస్సుల్లోంచి అభివాదం చేస్తూ వారంతా ముందుకు సాగారు. అనంతరం చార్మినార్ నుంచి లాడ్‌బజార్ వరకు నిర్వహించిన హెరిటేజ్ వాక్‌లో ప్రపంచ సుందరీమణులు పాల్గొన్నారు. చార్మినార్ ప్రాంగణంలో అప్పటికే ఏర్పాటు చేసిన స్టేజి పైనుంచి గ్రూప్ ఫోటో దిగిన అనంతరం చారిత్రాత్మక చార్మినార్ కట్టడం చరిత్ర, ఇతర విశేషాలను అధికారులు వారికి వివరించారు. తర్వాత కాలినడకన లాడ్ బజార్‌కు వెళ్లి అప్పటికే ఎంపిక చేసిన గాజుల షోరూంలో షాపింగ్ చేశారు. అనంతరం బస్సుల్లో చౌమహల్లా ప్యాలెస్‌కు డిన్నర్ కోసం వెళ్లారు.

- మిస్ వరల్డ్ పోటీదారుల హెరిటేజ్ వాక్ నేపథ్యంలో మంగళవారం ఉదయం నుంచే నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ చార్మినార్ వద్ద తిష్ట వేశారు. భద్రతా చర్యలు, ఇతర ఏర్పాట్లు, ట్రాఫిక్ మళ్లింపులను స్వయంగా పర్యవేక్షించారు.
- చార్మినార్ నలువైపులా చిరు వ్యాపారులను అప్పటికే కట్టడి చేసిన నగర పోలీసులు పాసులున్న వారినే అనుమతించారు.
- మిస్ వరల్డ్ పోటీదారులు పాతబస్తీకి వస్తున్నారని సమాచారం తెలుసుకున్న స్థానికులు పెద్ద ఎత్తున మదీనా, గుల్జార్ హౌస్ ప్రాంతాలకు చేరుకొని ఘనంగా స్వాగతం పలికారు. వారితో ఫొటోలు, సెల్ఫీలు తీసుకునే ప్రయత్నం చేశారు.
- మిస్ వరల్డ్ పోటీదారుల రాక సందర్భంగా మదీనా సర్కిల్, లాడ్ బజార్ వద్ద ముత్యపు చిప్ప.. అందులో ముత్యాలతో ఏర్పాటు చేసిన డిజైన్ ఆకట్టుకుంది. పెరల్స్ సిటీగా పేరొందిన నగరం ప్రత్యేకతను చాటేలా ఏర్పాటు చేసిన ముత్యపు చిప్ప డిజైన్ ఇటు మిస్ వరల్డ్ పోటీదారులతో పాటు స్థానికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ప్రయాణికులు 100 శాతం బస్సులు 60 శాతమే



గ్రేటర్‌లో సుమారు 40 శాతం బస్సుల కొరత

- రెండేళ్లలో పెరిగిన ప్రయాణికులు
- తగ్గుముఖం పట్టిన సిటీ బస్సులు
- డొక్కు బస్సుల స్థానంలో రీప్లేస్‌మెంట్‌తో సరి

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరం పరిధి ట్రిపుల్ ఆర్ వరకు పెరిగింది. ఫ్యూచర్‌సిటీ ఇప్పటి నుంచే అరచేతిలో వైకుంఠాన్ని చూపిస్తోంది. రానున్న రోజుల్లో హైదరాబాద్ అతి పెద్ద గ్లోబల్‌సిటీగా అవతరించనుందని ప్రభుత్వం పదే పదే ప్రస్తావిస్తోంది. కానీ ఈ విస్తరణకు తగినవిధంగా ప్రజారవాణా సదుపాయాల అభివృద్ధిపైన మాత్రం దృష్టి సారించడం లేదు. మెట్రో రెండో దశకు డీపీఆర్‌లు సిద్ధమైనప్పటికీ కేంద్రం నుంచి అనుమతులు లభించకపోవడంతో ఆ ప్రాజెక్టు ఊగిసలాడుతోంది. రోజురోజుకూ పెరుగుతున్న ప్రయాణికుల అవసరాలు, ఔటర్‌ను దాటుకొని ట్రిపుల్ ఆర్ వరకు విస్తరిస్తున్న కాలనీలు, జనావాసాల దృష్ట్యా రవాణా రంగానికి చెందిన నిపుణుల అంచనాల ప్రకారం హైదరాబాద్ మహానగరానికి ఇప్పటికిప్పుడు కనీసం 6 వేల బస్సులు అవసరం. కానీ పదేళ్లుగా కొత్త బస్సులు రోడ్డెక్కలేదు. కాలం చెల్లిన వాటి స్థానంలో ఎలక్ట్రికల్ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఏసీ కేటగిరీలకు చెందిన అద్దె బస్సులను ప్రవేశపెట్టడం మినహా ప్రజావసరాలకు అనుగుణంగా సిటీబస్సులు అందుబాటులోకి రాలేదు. మరోవైపు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టిన తరువాత అన్ని బస్సులు ఇంచుమించు 100 శాతం ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయి. కానీ 60 శాతం బస్సులే రవాణా సదుపాయాన్ని అందజేస్తున్నాయి. రెండేళ్లలో సుమారు 40 శాతం బస్సులు తగ్గాయి. బస్సుల కొరత క్రమంగా పెరుగుతోంది.

కొత్త బస్సులేవి..?

నగరంలో ఒకవైపు సొంత వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగినప్పటికీ మరోవైపు సిటీబస్సుల వినియోగం కూడా పెరిగింది. మెట్రో రైళ్లు తిరిగే కారిడార్‌లలో మినహాయించి నగరం నలువైపులా ప్రయాణికులు బస్సులపైనే ఆధారపడి రాకపోకలు సాగిస్తున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, దినసరి కూలీలు తదితర వర్గాలకు చెందిన ప్రయాణికులు వివిధ ప్రాంతాల మధ్య రాకపోకలు సాగించేందుకు సిటీ బస్సులను ఎక్కువగా వినియోగిస్తున్నారు. ప్రత్యేకించి మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం అందుబాటులోకి వచ్చిన తరువాత ప్రయాణికుల సంఖ్య బాగా పెరిగింది. రెండేళ్ల క్రితం సుమారు 16 లక్షల మంది ప్రయాణం చేయగా, ఇప్పుడు ఆ సంఖ్య సుమారు 22 లక్షలకు చేరినట్లు అంచనా. కేవలం ఈ రెండేళ్ల కాలంలోనే ఇంచుమించు 6 లక్షల మంది పెరిగారు. 2023 డిసెంబర్‌లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని ప్రవేశపెట్టిన తరువాత మెట్రోల్లో ప్రయాణం చేసే మహిళలు, సొంత వాహనాలను వినియోగించేవారు సైతం సిటీబస్సుల వైపు మళ్లారు. మరోవైపు తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే మహిళా ప్రయాణికుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. ఇదే సమయంలో బస్సుల సంఖ్య మాత్రం పెరగడం లేదు. నగరంలోని 28 డిపోల పరిధిలో 2800 బస్సులు మాత్రమే ఉన్నాయి. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రయాణికుల రద్దీతో కిక్కిరిసిపోతున్నాయి. శివారు ప్రాంతాలు, కాలనీలకు బస్సుల కొరత తీవ్రంగా ఉంది. వందలాది ప్రాంతాలకు ఉదయం, సాయంత్రం ఒకటి, రెండు ట్రిప్పుల చొప్పున మాత్రమే తిరుగుతున్నాయి. దీంతో మిగతా సమయాల్లో ప్రయాణికులు సెవెన్‌సీటర్ ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. కొత్తగా కొన్ని బస్సులను ప్రవేశపెట్టినప్పటికీ కాలం చెల్లిన వాటి స్థానంలో అందుబాటులోకి వచ్చినవే కానీ పెరుగుతున్న ప్రయాణికులు, విస్తరిస్తున్న హైదరాబాద్ మహానగరం అవసరాల మేరకు ప్రవేశపెట్టినవి కాదని ఆర్టీసీ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు.

మెట్రో నగరాలతో పోటీ ఎక్కడ?



- ముంబయి, ఢిల్లీ, బెంగళూరు, తదితర మెట్రో నగరాల్లో సబర్బన్ రైళ్లు, మెట్రో రైళ్లతో పాటు సిటీ బస్సులను కూడా గణనీయంగా పెంచారు. దీంతో లక్షలాది మంది ప్రయాణికులు ఎక్కడి నుంచి ఎక్కడి వరకైనా తేలిగ్గా ప్రయాణం చేసే సదుపాయం ఉంది.
- దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం 8,121 బస్సులు ఉన్నాయి. వచ్చే రెండేళ్లలో మరో 2000 బస్సులను కొనుగోలుచేయాలనే ప్రణాళికలు ఉన్నాయి.
- ముంబయిలో ప్రస్తుతం 3,228 బస్సులు అందుబాటులో ఉన్నాయి.2027 నాటికి ఈ సంఖ్యను 8000 లకు పెంచేందుకు కార్యాచరణ చేపట్టారు.
- బెంగళూరులో 6,835 బస్సులు అందుబాటులో ఉన్నాయి. మరో 1000 బస్సులను కొత్తగా కొనుగోలు చేసే ప్రతిపాదన ఉంది.
- హైదరాబాద్‌లో 2,800 బస్సులు తిరుగుతున్నాయి. ఈ ఏడాది కొత్తగా మరో 500 బస్సులను అద్దె ప్రాతిపదికన ఏర్పాటు చేయాలనే ప్రణాళికలు ఉన్నాయి.



రోడ్డుపై పడిపోయిన భారీ మర్రి చెట్టు



నిలిచిపోయిన వాహనాలు

చెట్టు కూలె.. ట్రాఫిక్ నిలిచె

గాలివానకు మండలంలోని హైదరాబాద్- బీజాపూర్ రహదారిపై ఖానాపూర్ బస్‌స్టేజీ సమీపంలో భారీ మర్రిచెట్టు నేలకొరిగింది. మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా గాలివాన కురిసింది. ఖానాపూర్ బస్‌స్టేజీ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న చెట్టు అమాంతం రోడ్డుపై పడిపోయింది. ఆ సమయంలో వాహనాలు అంతగా లేకపోవడంతో ప్రమాదం తప్పింది. రోడ్డుకు అడ్డుగా చెట్టు పడిపోవడంతో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయింది. ట్రాఫిక్ పోలీసులు స్థానికుల సహకారంతో జేసీబీలతో చెట్టును పక్కకు తొలగించి క్లియర్ చేయించారు.

– చేవెళ్ల

దప్పిక తీరుస్తున్న దాతృత్వం

- షాద్‌నగర్‌లో చలివేంద్రాలు, అంబలి కేంద్రాల నిర్వహణ
- వేసవిలో ఉపశమనం పొందుతున్న బాటసారులు, స్థానికులు



షాద్‌నగర్‌లో మజ్జిగ పంపిణీ చేస్తున్న దాతలు

షాద్‌నగర్: సమాజ సేవలో మేము సైతం అంటూ ముందుకుసాగుతున్నారు పట్టణానికి చెందిన పలువురు వ్యక్తులు. ఏటా వేసవిలో చలివేంద్రాలు, అంబలి కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దప్పిక తీరుస్తున్నారు. షాద్‌నగర్‌కు చెందిన వాసవి చిట్ ఫండ్ అధినేత, విశ్వహిందు పరిషత్ రాష్ట్ర కోశాధికారి బండారి రమేశ్ తన తల్లిదండ్రులైన దివంగత లక్ష్మమ్మ, రాజయ్యల జ్ఞాపకార్థం స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట 20 ఏళ్లుగా చలివేంద్రం ఏర్పాటు చేసి, బాటసారులు, స్థానికులు, ప్రయాణికులకు తాగునీరు పంపిణీ చేస్తున్నారు. పదేళ్లుగా అంబలి సైతం అందజేస్తున్నారు. వివిధ పనుల నిమిత్తం షాద్‌నగర్ వచ్చే ప్రజలు ఇక్కడ మంచినీళ్లు, అంబలి తాగి ఉపశమనం పొందుతున్నారు. అలాగే న్యూసిటీ కాలనీకి చెందిన శ్రీనివాస్‌చారి పట్టణంలోని పరిగి రోడ్డులో ఉన్న పోచమ్మ దేవాలయం ఎదురుగా చలివేంద్రం, మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. గత మూడేళ్లుగా నిత్యం వందలాది మందికి మంచి నీళ్లు, మజ్జిగ అందజేస్తున్నారు.

సేవ దేవుడిచ్చిన వరం



ప్రజలకు సేవ చేయడం దేవుడిచ్చిన వరం. వివిధ పనులపై పట్టణానికి వచ్చే వారు వేసవిలో తాగునీటి కోసం ఇబ్బంది పడుతుంటారు. పదేళ్ల క్రితం ఈ సమస్య చాలా జఠిలంగా ఉండేది. పేదలకు గుక్కెడు నీళ్లు ఇవ్వాలని భావించి, 20ఏళ్ల క్రితం చలివేంద్రం ప్రారంభించా. పదేళ్లుగా అంబలి సైతం పంపిణీ చేస్తున్నాం.

– బండారు రమేశ్, వ్యాపారవేత్త, షాద్‌నగర్

సేవే లక్ష్యం



వేసవి కాలంలో చాలా మంది మంచి నీటి కోసం ఇబ్బందులు పడుతుంటారు. ఇలాంటి వారి కోసమే మూడేళ్లుగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాం. సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్నా.

– శ్రీనివాస్‌చారి, న్యూసిటీ కాలనీ, షాద్‌నగర్

కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య



అంజయ్య (ఫైల్)

కేశంపేట: కడుపునొప్పి భరించలేక ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... తొమ్మిదిరేకుల గ్రామానికి చెందిన నాగిళ్ల అంజయ్య(50) వ్యవసాయం చేసుకుంటూ భార్యతో కలిసి ఉండేవాడు. ఈ నెల 10న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అటునుంచి మెరుగైన చికిత్స కోసం ఉస్మానియాకు తీసుకెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి భార్య అంజమ్మ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరహరి తెలిపారు. కాగా అంజయ్య మృతిపై గ్రామస్తులు పలు అనుమానాలను వెలిబుచ్చారు. విచారణలో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గృహిణి అదృశ్యంపై కేసు నమోదు



నజ్మా కాతూన్ (ఫైల్)

పహాడీషరీఫ్: గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన అస్లాం అన్సారీ తన భార్య నజ్మా కాతూన్(23), పిల్లలతో కలిసి ఎనిమిది నెలల క్రితం జీవనోపాధి నిమిత్తం జల్‌పల్లి గ్రామానికి వలస వచ్చారు. ఈ నెల 11వ తేదీన ఉదయం పిల్లలతో కలిసి అస్లాం నిద్రిస్తుండగా, ఇంట్లో ఎవరికి చెప్పకుండా నజ్మా బయటికి వెళ్లిపోయింది. ఎంతకి రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. బిహార్‌కే చెందిన సిరాజ్ అన్సారీ అనే వ్యక్తిపై అనుమానం ఉందంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 87126 62367 నంబర్‌లో సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

యువతి అదృశ్యం



కవిత (ఫైల్)

మొయినాబాద్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైంది. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎనికేపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎనికేపల్లికి చెందిన వడ్డె కవిత(23) మంగళవారం ఉదయం 8 గంటలకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

చెరువెండుతోంది!

- ఎడారిని తలపిస్తున్న చెరువులు, కుంటలు
- నీళ్లు లేక ఏపుగా పెరిగిన కంపచెట్లు
- పాడైన తూములు, కాల్వలు
- మర్మతులు చేయాలని రైతుల అభ్యర్థన



గుంతల్లోనే నీళ్లున్న చింతపట్ల లక్ష్మణ్ చెరువు



నక్కర్తమేడిపల్లిలోని సాలీ చెరువులో మొలుస్తున్న కంపచెట్లు

యాచారం: మండల పరిధిలోని మెజార్టీ చెరువులు, కుంటలు ఎండిపోయి ఎడారిని తలపిస్తున్నాయి. మూడేళ్లుగా సరైన వర్షాలు కురవకపోవడంతో గుంతల్లో చేరిన కొద్దిపాటి నీరు సైతం ఇంకిపోయింది. మొత్తం 24 గ్రామాల్లో 120 చెరువులు, కుంటలు, 50కి పైగా చెక్‌డ్యాంలు ఉన్నాయి. వీటిలో నీళ్లుంటేనే పంటల సాగుకు సమృద్ధిగా నీళ్లు అందుతాయి. సుమారు ఎనిమిది వేలకు పైగా బోరు బావుల కింద రైతులు వరితో పాటు పలు రకాల కూరగాయ పంటలు వేసి ఉపాధి పొందుతుంటారు. కానీ ప్రస్తుతం సుమారు 5 వేలకు పైగా బోర్లు అడుగంటాయి. మిగిలిన వాటిలో కొద్దిపాటి నీళ్లు వస్తున్నాయి. 40 వేల ఎకరాలకు పైగా సాగయ్యే పంటల విస్తీర్ణం 80 శాతానికి పైగా పడిపోయింది. మూగ జీవాల దాహార్తి తీర్చడం కూడా కష్టంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదే అదును

చెరువులు, కుంటల్లో నీళ్లు లేక ఎండిపోవడంతో మరమ్మతు పనులకు ఇదే మంచి సమయం. వర్షాలు కురిస్తే చెరువులు, కుంటల్లోకి నీరు చేరి పనులు సాగవు. ప్రస్తుతం వీటిలో కంపచెట్లు ఏపుగా పెరిగాయి. కాల్వలు, తూములు సైతం మరమ్మతులకు గురయ్యాయి. వీటిని బాగు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. తక్కళ్లపల్లిలోని చెన్నరెడ్డి చెరువు, నక్కర్తమేడిపల్లిలోని సాలిచెరువు, ఊర చెరువు, తాడిపర్తిలోని బంధం చెరువు, కుర్మిద్దలోని పెద్ద చెరువు, మల్కీజ్‌గూడలోని మగ్దుంఆలీ చెరువు, మొండిగౌరెల్లిలోని పకీరోని చెరువు, మద్రికుంట, నల్లవెల్లిలోని నల్లవెల్లి చెరువు ఇలా ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో నీళ్లు లేకపోవడంతో ఎండిపోయాయి. దీనికి తోడు ఎఫ్‌టీఎల్ హద్దులు లేకపోవడంతో పలు గ్రామాల్లోని శిఖం భూములు ఆక్రమణకు గురయ్యాయి.

ఎండిపోతున్న లక్ష్మణ్ చెరువు

చింతపట్లలోని లక్ష్మణ్ చెరువులో గత ఏడేళ్లుగా నీళ్లు సమృద్ధిగా ఉన్నాయి. దీంతో యాచారం, మంచాలతో పాటు నల్గొండ జిల్లా మర్రిగూడ, చింతపల్లి మండలాల్లోని అనేక గ్రామాల్లోని బోరుబావుల్లో పుష్కలంగా నీళ్లుంటాయి. ప్రస్తుతం లక్ష్మణ్ చెరువులో సైతం గుంతల్లోనే నీళ్లున్నాయి. ఎండల తీవ్రత ఇలాగే ఉంటే పక్షం రోజుల వ్యవధిలోనే చెరువు పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉంటుంది. ఇదే జరిగితే బోరుబావుల్లో నీళ్లు తగ్గి కరువు పరిస్థితులు నెలకొనే ప్రమాదం ఉంది.

మరమ్మతులకు కృషి



చెరువులు, కుంటల్లోని కంపచెట్లను తొలగించడంతో పాటు మర్మతులకు కృషి చేస్తున్నాం. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి ఎఫ్‌టీఎల్ హద్దులు గుర్తిస్తాం.

– అయ్యప్ప, తహసీల్దార్ యాచారం

జాతరకు వెళ్లొస్తూ.. అనంత లోకాలకు

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం



రాజు (ఫైల్)

కందుకూరు: పక్కన ఊరిలో జరుగుతున్న జాతరకు వెళ్లొస్తూ గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన విషాద ఘటన స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కందుకూరు సీఐ జంగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గూడూరుకు చెందిన పోలదాస్ రాజు(40) ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయన సోమవారం సాయంత్రం ఊట్లపల్లిలో జరుగుతున్న జాతరకు బైక్‌పై వెళ్లి తిరిగి రాత్రి వేళలో స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో కందుకూరు సమీపంలో ఏఎస్ దాబా ఎదుట శ్రీశైలం హైవేపై వెనక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం అతని బైక్‌తో పాటు ముందు నడుచుకుంటూ వెళ్తున్న ఫౌల్ట్రీఫారమ్‌లో పని చేసే ఒడిశాకు చెందిన మను, జగన్‌లను ఢీకొట్టుకుంటూ వెళ్లింది. దీంతో బైక్ పైనుంచి కిందపడి తీవ్రంగా గాయపడిన రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మనుకు గాయాలు కాగా 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

హక్కుల సాధనకు సమష్టి పోరు

బీసీ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్



నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: హక్కుల సాధన కోసం అందరూ ఐక్యంగా పోరాడాలని బీసీ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ అన్నారు. మండల పరిధిలోని అయ్యవారిపల్లిలో మంగళవారం బీసీ సేన మండల మహిళా అధ్యక్షురాలు జక్కుల జలజ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్య్రం వచ్చి ఏళ్లు గడుస్తున్నా బీసీలు అన్ని రంగాల్లో వెనకబడే ఉన్నారన్నారు. ప్రభుత్వాలు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగించుకుంటున్నాయని తెలిపారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో బీసీలు రాణించాలని ఆకాంక్షించారు. తమ హక్కులు సాధించుకునేందుకు ఐక్యంగా పోరాటం చేయాలన్నారు. ఇందులో భాగంగా ప్రతి గ్రామంలో బీసీ సేన కమిటీలను ఎన్నుకుంటున్నామన్నారు. గ్రామ నూతన కమిటీని ఎన్నుకొని నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, నర్సింలు, జయ, శ్రీకాంత్, వసంత పాల్గొన్నారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్ట్

చాంద్రాయణగుట్ట: మహిళ హత్య కేసులో నిందితుడిని చాంద్రాయణగుట్ట పోలీసులు అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ గోపి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..కేశవగిరి హిల్స్ ప్రాంతానికి చెందిన కెతావత్ బుజ్జి(40)కి పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన జుల్ఫికర్ అలీ(43)తో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి తీరితీసింది. మొదట్లో జల్‌పల్లిలో నివాసం ఉండే జుల్ఫికర్ ఆ తర్వాత కేశవగిరికి మకాం మార్చాడు. ఈ క్రమంలో తనను పెళ్లి చేసుకోవాలంటూ బుజ్జి అతడిపై ఒత్తిడి చేసింది. అయితే తనకు అప్పటికే పెళ్లై పిల్లలున్న నేపథ్యంలో అలీ పెళ్లి అంశాన్ని దాట వేస్తూ వస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 7న బుజ్జి అలీకి ఫోన్ చేసి ఇంటికి రావాలని కోరింది. అందుకు అతను నిరాకరించడంతో ఫోన్‌లోనే దూషించింది. దీనిని అవమానంగా భావించిన అలీ ఆమెను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా 8న రాత్రి ఆమె ఇంటికి వెళ్లిన అలీ బుజ్జి గొంతు కోసి హత్య చేయడమేగాక, ఆధారాలు లేకుండా చేసేందుకు మృతదేహానికి నిప్పంటించి పరారయ్యాడు. మంటలు రావడాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

గంజాయి విక్రేత అరెస్ట్

రాజేంద్రనగర్: అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని శంషాబాద్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సాలోని గజపతి జిల్లాకు చెందిన సుదీప్ కుమార్ జెన మంగళవారం రాజేంద్రనగర్ పీవీ నర్సింహా రావు ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నంబర్ 240 నుంచి అక్రమంగా గంజాయిని తరలిస్తున్నాడు. విశ్వసనీయమైన సమాచారం అందుకున్న శంషాబాద్ పోలీసులు దాడులు చేసి సుదీప్ కుమార్‌ను అరెస్ట్ చేసి 11.825 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సుదీప్ కుమార్ గుర్తు తెలియని వ్యక్తి వద్ద నుంచి గంజాయిని కొనుగోలు చేసి నగరానికి తీసుకొచ్చి ఆరాంఘర్, చింతల్‌మేట్ ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో తెలిపాడు.

రోడ్డు ప్రమాదంలో కొడుకు.. కరెంట్ షాక్‌తో తండ్రి

- నెల రోజుల వ్యవధిలో తండ్రీకొడుకుల దుర్మరణం
- పుట్టెడు దుఃఖంలో బాధిత కుటుంబం



రాములు (ఫైల్)

కందుకూరు: కొడుకు మరణాన్ని జీర్ణించుకోలేక మనోవేదనకు గురవుతున్న ఓ తల్లికి భర్త మృతి మరింత శోకాన్ని మిగిల్చింది. నెల రోజుల వ్యవధిలో కుమారుడు, భర్తను కోల్పోయి గుండెలు బాదుకుంటోంది. ఇందుకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. రంగారెడ్డి జిల్లా మాదాపూర్‌కు చెందిన మంద రాములు(49), సుజాత దంపతులు వ్యవసాయంతో పాటు పశువులను పోషిస్తూ జీవనం సాగిస్తున్నాడు. వీరికి ఇద్దరు కొడుకులు, కూతురు సంతానం. పెద్దకొడుకు, కూతురు వివాహం చేశారు. లారీ డ్రైవర్‌గా పనిచేసే చిన్న కొడుకు భానుప్రకాశ్ నెల రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబమంతా ఇదే బాధలో ఉంది. అయితే సోమవారం ఉదయం రాములు పశువులకు మేత కోసేందుకు పొలం వద్దకు వెళ్లాడు. తన పక్క పొలంలోని గట్లపై గడ్డి కోస్తుండగా.. కొడవలి సర్వీస్ వైర్‌ను తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మధ్యాహ్నం భోజనం తీసుకుని వెళ్లిన సుజాత భర్తను చూసి గుండెలు బాదుకుంది. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ జంగయ్య తెలిపారు.

చెరువులో మృతదేహం లభ్యం

పహాడీషరీఫ్: చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుజూసింది. ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉస్మాన్‌నగర్‌లోని బుర్హాన్‌ఖాన్ చెరువులో మంగళవారం ఉదయం వ్యక్తి మృతదేహం తేలియాడుతుండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటికి తీసి పరిశీలించగా, ఒంటిపై వస్త్రాలు లేకుండా ఉన్నాడు. నడుముకు మొలత్రాడు, ఎడమ కాలుకు దారం కట్టి ఉండడాన్ని బట్టి హిందువుగా పోలీసులు భావిస్తున్నారు. చెరువులో పడి 24 గంటలు కావచ్చని, మృతుడి వయసు 40–45 ఏళ్ల నడుమ ఉంటుందని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కుళ్లిన స్థితిలో..

పహాడీషరీఫ్: కుళ్లిన స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఎల్.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మామిడిపల్లి గ్రామ శివారు సీఐఎస్‌ఎఫ్ క్వార్టర్స్ ప్రాంతంలోని మామిడితోట గోడను ఆనుకొని మృతదేహం పడి ఉండడాన్ని సోమవారం సాయంత్రం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి వెళ్లి పోలీసులు పరిశీలించగా మృతదేహం పూర్తిగా కుళ్లిన స్థితిలో కనిపించింది. 15 రోజుల క్రితం చనిపోయి ఉంటాడని, మృతుడి వయసు 45–50 ఏళ్ల నడుమ ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఒంటిపై నలుపు రంగు టీ–షర్ట్, నీలి రంగు ప్యాంటు ధరించి ఉంది. కాగా ఇటీవల ఈ ప్రాంతంలో ఓ వ్యక్తి పిచ్చిగా ప్రవర్తిస్తూ మట్టి, గడ్డి తినడం గమనించినట్లు స్థానికుల ద్వారా పోలీసులకు తెలిసింది. మామిడితోట గార్డెన్ అద్దెదారుడు తుమ్మ రాజశేఖర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇతని సంబంధీకులెవరైనా ఉంటే పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62402 నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు



బోర్డును ఏర్పాటు చేసిన రెవెన్యూ సిబ్బంది

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వ భూములను కబ్జా చేయాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్ హెచ్చరించారు. కలెక్టర్ కార్యాలయంలో తోల్‌కట్ట గ్రామానికి చెందిన గ్రామస్తులు ప్రభుత్వ భూములు కాపాడాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం అధికారులు స్పందించి తోల్‌కట్ట రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 107లో రెండు ఎకరాల్లో వేస్తున్న అక్రమ ఫెన్సింగ్‌ను అడ్డుకున్నారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు అదనపు ఆర్‌ఐ రాజేష్, రెవెన్యూ సిబ్బంది జేసీబీ సహాయంతో ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న ఫెన్సింగ్‌ను తొలగించారు. అదే స్థలంలో ప్రభుత్వ సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో కబ్జాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ద్విచక్ర వాహనాల ఢీ

తీవ్ర గాయాలతో వ్యక్తి మృతి



సోమ్లానాయక్ (ఫైల్)

కడ్తాల్: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని అన్మాస్‌పల్లి–కడ్తాల్ రహదారిపై చోటు చేసుకుంది. సీఐ గంగాధర్ తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని గానుగుమార్లతండాకు చెందిన మునావత్ సోమ్లా నాయక్(38) సోమవారం రాత్రి తండా నుంచి ద్విచక్రవాహనంపై కడ్తాల్‌కు వస్తున్నాడు. అదే సమయంలో రామస్వామి అనే వ్యక్తి బైక్‌పై కడ్తాల్ నుంచి గానుగుమార్లతండాకు బయలుదేరాడు. మార్గమధ్యలో మల్లప్ప ఫౌల్ట్రీఫాం సమీపంలో సోమ్లానాయక్ బైక్‌ను రామస్వామి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇరువురికీ తీవ్ర గాయాలయ్యాయి. సోమ్లానాయక్‌కు తీవ్ర గాయాలవ్వడంతో 108 వాహనంలో మహేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు మృతుడి సోదరుడు పాండు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. రామస్వామికి కూడా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు.

పిడుగుపాటు.. ముందే తెలిసేట్టు

- దామిని యాప్‌తో గుర్తించే వెసులుబాటు
- జాగ్రత్తలు పాటిస్తే బయటపడే అవకాశం



దామిని లైట్నింగ్ యాప్

షాబాద్: అకాల వర్షాలకు పిడుగులు పడి ప్రజలు, మూగ జీవాలు మృత్యువాత పడుతున్నారు. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు ప్రజా జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాలైన ఉరుములతో కూడిన వర్షాలతో పాటు పిడుగు పాటుతో ప్రాణ, ఆస్తినష్టం జరుగుతూనే ఉంది. ఏటా పిడుగుపాటుకు గురై అధిక సంఖ్యలో మూగజీవాలు, చాలా మంది ప్రజలు ప్రాణాలు సైతం కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. అయితే పిడుగు పాటుపై పరిశోధనలు చేసిన భారత వాతావరణ శాఖ ముందే పసిగట్టేందుకు ఓ యాప్‌ను ఆవిష్కరించింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రాఫికల్ మెటరాలజీ (ఐఐటీఎం) 'దామిని' యాప్‌ను రూపొందించింది.

యాప్ డౌన్‌లోడ్ ఇలా

ప్రతి పౌరుడు తన స్మార్ట్ ఫోన్‌లోని ప్లేస్టోర్ నుంచి దామిని యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. యాప్‌ను తెరిచి పేరు, మొబైల్ నంబర్, అడ్రస్, పిన్‌కోడ్ నమోదు చేయాలి. అనంతరం జీపీఎస్ లొకేషన్ కోసం యాప్‌ను వినియోగించే సమయంలో మీ ప్రాంతంలో పిడుగుపడే అవకాశం ఉందో లేదో మూడు రంగుల్లో చూపిస్తుంది.

ఎరుపు రంగు: మీరు ఉన్న ప్రాంతంలో మరో 7 నిమిషాల వ్యవధిలో పిడుగుపడే అవకాశం ఉంటే ఆ సర్కిల్ ఎరుపు రంగులోకి వస్తుంది.

పసుపు రంగు: మీరు ఉన్న ప్రాంతంలో 10 నుంచి 15 నిమిషాల్లో పిడుగు పడేలా ఉంటే ఆ సర్కిల్ పసుపు రంగుగా మారుతుంది.

నీలం రంగు: 18 నుంచి 25 నిమిషాలలోపు పిడుగు పడే అవకాశం ఉంటే ఆ సర్కిల్ నీలం రంగులో కనిపిస్తుంది.

ఇవి పాటించాలి

- నల్లటి మబ్బులు ఆకాశం అంతటా విస్తరించి భారీ వర్షం కురుస్తున్నప్పుడు రైతులు పొలాల్లో తిరగకుండా ఏవైనా భవనాల్లోకి లేక తాము ఉన్న స్థానంలోనే మోకాళ్లపై కూర్చొని రెండు చెవులను చేతులతో మూసుకోవాలి.
- బహిరంగ ప్రదేశాల్లో పిడుగుపడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. మొబైల్ సిగ్నల్స్ పిడుగుపడే అవకాశాన్ని ఎక్కువగా కల్పిస్తుంది. పంట పొలాల్లో వాడకూడదు.
- విద్యుత్ స్తంభాలు, సెల్‌ఫోన్ టవర్లు, బోర్‌పంప్ సెట్లకు దూరంగా ఉండాలి. బోరు మోటార్ల నుంచి వచ్చే నీటిని కూడా ఆ సమయంలో వినియోగించవద్దు.
- పశువులను మేతకు బయటకు తీసుకెళ్లకుండా పాకలోనే ఉంచాలి.
- పిడుగులు పొడవైన చెట్ల మీద పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి వర్షం కురిసినప్పుడు చెట్ల కింద ఉండొద్దు.

యాప్ ఉపయోగకరం



వాతావరణంలోని మార్పులను పసిగట్టి పిడుగుపడే అవకాశాన్ని తెలిపే దామిని యాప్ ప్రజలతో పాటు ముఖ్యంగా రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. యాప్‌ని వినియోగించి పిడుగుపడే విషయాన్ని గుర్తించి ప్రాణాలు కాపాడుకోవచ్చు.

– అన్వర్, తహసీల్దార్, షాబాద్